
ప్రజాశక్తి

శనివారం 17 ఫిబ్రవరి 2024

5

పార్వతీపురం మన్యం



ఎఆర్ డిఎస్‌పిగా వెంకట అప్పారావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు డిఎస్పీగా ఎస్.వెంకట అప్పారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించారు. కాకినాడ ఎఆర్‌లో విధులు నిర్వహించిన ఈయన ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా ఎఆర్ డిఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు.



ఎస్‌పికి పూల మొక్క అందజేస్తున్న ఎఆర్ డిఎస్‌పి వెంకటప్పారావు



పార్వతీపురంలో ర్యాలీ చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ప్రజా వ్యతిరేక విధానాలపై

గర్జించిన రైతు, కార్మిక సంఘాలు

విజయవంతమైన గ్రామీణ భారత్ బంద్, సమ్మె



సాలూరులో ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు నాయకులు నాయుడు

కేంద్రంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై శుక్రవారం కార్మిక, రైతు, ప్రజా సంఘాలు దేశవ్యాప్తంగా తలపెట్టిన గ్రామీణ భారత్ బంద్ విజయవంతమైంది. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బిజెపికి బుద్ధి చెప్పాలంటూ జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ప్రజాసంఘాల నాయకులు ర్యాలీలు, మానవహారాలు నిర్వహించారు.

పార్వతీపురంరూరల్ : సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జరిగిన గ్రామీణ బంద్‌కు మద్దతుగా సూరంపేట ఎఫ్‌సిఐ గిడ్డంగుల కార్మిక సంఘం నాయకుల అధ్వర్యంలో నర్సిపురంలోనూ, పాలకొండ రోడ్డులోని వై జంక్షన్ దగ్గర ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు బంటు దాసు, సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ మోడీ పాలనలో వ్యవసాయ రంగం నాశనం అవుతోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. నల్ల చట్టాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలను సైతం నీరుగారుస్తున్నారని, ప్రభుత్వ రంగ సంస్థలు లేకుండా బారతీయ యువతకు ఉపాధి లేకుండా చేస్తోందని విమర్శించారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేలా మోడీ విధానాలు అమలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మికులు, రైతులు, రైతు కూలీలు, కార్మికులు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు పెద్దిరెడ్డిల వెంకటరమణ, అక్కిన ధనంజయ, మాగిలపల్లి తిరుపతిరావు, సిరిసిపల్లి శ్రీనివాసరావు, అక్కిన శంకర్రావు, యోగి రెడ్డి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : గ్రామీణ బంద్‌లో భాగంగా ఎపి రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుంచి బజారు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం హనుమాన్ జంక్షన్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు మాట్లాడుతూ ఢిల్లీలో జరిగే రైతుల పోరాటాలకు మద్దతుగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి ఈశ్వరరావు, కౌలు రైతు సంఘం నాయకులు రెడ్డి రమణమూర్తి, ఎల్ఐసి నాయకులు గొట్టాపు శ్రీనివాసరావు, కళాసీ సంఘ నాయకులు తేలు సత్యం, సిహెచ్ కృష్ణ, బి.అప్పారావు, వై.రామారావు తదితరులు పాల్గొన్నారు.

సాలూరు : దేశంలో నరేంద్ర మోడీ, బిజెపి అవలంబిస్తున్న కార్మిక కర్షక, రైతు, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్త ఆందోళన పోరాటాల్లో భాగంగా సాలూరు పట్టణంలో ర్యాలీ, సభ జరిగింది. ర్యాలీ రాజేశ్వరరావు పార్క్ వద్ద ప్రారంభమై వెంకటేశ్వర డీలక్స్, చిన్న బజార్, బోసుబొమ్మ ,పోస్ట్ ఆఫీస్, గుండా స్టేట్ బ్యాంక్ వరకు సాగింది. అనంతరం రాజేశ్వరరావు పార్కు వద్ద ప్రారంభమైన సభనుద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షులు రాముడు, శంకర్రావు మాట్లాడుతూ కార్మిక కర్షక ఐక్యత కాపాడేందుకు మరిన్ని పోరాటాలు నిర్వహించాల్సి ఉన్నదని దానికి కార్మికులంతా సిద్ధపడాలని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ కమిటీ నాయకులు శ్రీనివాస్, సీతా, ఈశ్వరరావు, వెంకన్న, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట : మోడీ కార్పొరేట్ విధానాలకు. ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా బలిజిపేట లో రైతు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ మానవహారం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గేదెలు సత్యనారాయణ, రైతు కూలీ సంఘం నాయకులు మావిడి సింహాద్రి నాయుడు మాట్లాడారు. కార్యక్రమంలో రైస్ మిల్ యూనియన్, ఆటో, రిక్షా నాయకులు పళీల అప్పారావు, బద్దాన భానుమూర్తి, గంట్యాడ బలరాం, వెన్నెల వేణుగోపాల్, కూర్మా భాస్కరరావు, లక్షణ, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట: గ్రామీణ భారత్ బంద్‌లో భాగంగా స్థానిక సిఐటియు కార్యాలయం నుండి బస్టాండ్ వరకు ర్యాలీ చేసి మానవహారం నిర్వహించారు. ఈ ర్యాలీలో ప్రజా సంఘాలు వామపక్ష నాయకులు వామపక్ష నాయకులు పాల్గొన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఇంద్ర, సిపిఐ జిల్లా కార్యదర్శి కోరంగి మన్మధరావు మాట్లాడుతూ కార్మిక, రైతు చట్టాలను కాలరాస్తూ బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.లక్ష్మణరావు, సిఐటియు మండల కార్యదర్శి ఎం.కాంతారావు, సిపిఎం సీనియర్ నాయకులు పాలక సాంబయ్య, ఎఐవైఎఫ్ కోరంగి గోపి నాయకులు పాల్గొన్నారు.

కొమరాడ : సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు కొమరాడలో జరిగిన గ్రామీణ భారత్ బంద్ ప్రశాంతంగా ముగిసింది. మండల కేంద్రంలో భారీ ర్యాలీ అనంతరం అంతరాష్ట్ర రహదారిపై నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి పి.శ్రీనునాయుడు మాట్లాడారు. కార్యక్రమంలో వివిధప్రజాసంఘాల నాయకులు ఎ.ఉపేంద్ర, కె.వెంకటస్వామి, సంగమ్మ, వెంకటేష్, పి.కృష్ణవేణి, ఆర్.శివున్నాయుడు, మిన్నారావు, హేమ, గౌర్నాయుడు, చిలకమ్మ, సోములు, అప్పలస్వామి, సింహాచలం, రామస్వామి, పోలి నాయుడు, మాజీ సర్పంచ్‌లు గుంప స్వామి, చోడి సాంబతో కార్మికులు, ఆటోడ్రైవర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పాలకొండ : దేశవ్యాప్త కార్మికుల సమ్మె- గ్రామీణ భారత్ బంద్‌లో భాగంగా రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పాలకొండ చెక్‌పోస్ట్ జంక్షన్ వద్ద జరిగిన రాస్తారోకో నిర్వహించారు. అనంతరం సిఐటియు ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్స్ యూనియన్ పాలకొండ పట్నంలో మెయిన్ రోడ్డు మీదగా ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ కేంద్ర బిజెపి కార్పొరేట్ –మతతత్వ విధానాలను ఐక్య పోరాటాల ద్వారా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు మండల సమన్వయ కమిటీ కార్యదర్శి కాద రాము అభ్యుదయ రైతు సీనియర్ రైతు సంఘం నాయకులు ఖండాపు ప్రసాదరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దూసి దుర్గారావు గిరిజన సంఘం మండల ప్రెసిడెంట్ ఎస్ గంగయ్య ఆటో డ్రైవర్స్ యూనియన్ ప్రతినిధులు మహేష్, జగదీష్, పి.రాము, జి.హరి, వంశీ, సంతు, కోటి, ఎ.అప్పారావు, ఎల్.రాము, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట : ఆటో కార్మిక సంఘం యూనియన్ నాయకులు పిన్నింటి రమేష్, సంయుక్త కిసాన్ మోర్చా రైతు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బోను గౌరి నాయుడు, మాదిరెడ్డి తిరుపతిరావు, బొంగు కృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సుర్రు రామారావు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు జన్ని రామయ్య, మంచాల శ్రీనివాసరావు, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు, చింత పోలిరాజు ఆధ్వర్యంలో పాచిపెంటలో గ్రామీణ బంద్ విజయవంతమైంది. ఈ సమ్మెలో ఆటో కార్మికులు స్వచ్ఛందంగా ఆటోలను నిలిపివేశారు.

కురుపాం : గ్రామీణ కార్మిక సంఘాలు బంద్ సందర్భంగా మండల కేంద్రంలో రావాడ జంక్షన్ నుండి బస్టాండ్ వరకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి బంద్ ప్రాముఖ్యత గురించి ప్రజలకు వివరించారు .ఈ కార్యక్రమంలో వామపక్షాల నాయకులు గరుగుబిల్లి సూరయ్య, ఉలక వాసు తదితరులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : గ్రామీణ బంద్ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మామిడిపల్లిలో బంద్ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎఐయుటిసి, సిఐటియు జిల్లా నాయకులు ఎస్.రామచంద్రరావు, ఎన్వై నాయుడు, టి.జీవ, రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అసిరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మళ్లీ ఏర్పడితే దేశంలోని సహజ వనరులు, ప్రభుత్వ రంగ సంస్థలన్నీ కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా అందజేస్తారన్నారు. కావున ఈ ప్రభుత్వాన్ని ప్రజలంతా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు వంతల సుందర్రావు, గెమ్మెల జానకీరావు, రైతు కూలీ సంఘం నాయకులు అప్పలస్వామి, రాము, శ్రామిక మహిళా సంఘం నాయకులు నారాయణమ్మ, కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం నాయకులు రాజమండ్రి రాము, మంగారమ్మతల్లి, ఆటో యూనియన్ నాయకులు జర్జాపు జ్యోతిష్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి తాడంగి గాసి, జెమ్మెల బోడమ్మ, చింత జోగయ్య, సూకురు గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : గ్రామీణ బంద్ కార్యక్రమంలో భాగంగా గుమ్మ లక్ష్మీపురంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్ మాట్లాడుతూ ఉద్యోగ, కార్మికులకు ఉద్యోగం భద్రత ఉండాలంటే మోడీ సర్కార్‌ను గద్దె దించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్, సహాయ కార్యదర్శి రామస్వామి, సిఐటియు మండల కార్యదర్శి కె.గౌరీశ్వరరావు, కుక్కిడి సర్పంచ్ బిడ్డిక రాజారావు, చెముడుగూడ ఎంపిటిసి మండంగి రమణ, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు బి.శంకరరావు, ఎం.సన్యాసిరావు, పి.మోహనరావు, అంగన్వాడీ, ఆశా, రిక్షా, గ్రీన్ అంబాసిడర్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో గ్రామీణ బంద్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఎన్.ప్రసాదరావు, పి.ప్రసాద్, వి.కాంచన, జయమ్మ, కల్యాణం, సుశీల, బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

భామిని: ఆలిండియా కిషాన్ సంయుక్త మోర్చా, కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ సమితి గ్రామీణ బంద్ పిలుపు మేరకు స్థానిక అంబేద్కర్ కూడలిలో రైతు ,కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ప్రజా సంఘాల నాయకులు కె. మిన్నారావు, జి.జగన్నాయుకులు, కె.భాస్కరరావు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు జి.ప్రసాద్ ,జి.పుష్పనాధం పాల్గొన్నారు.

గరుగుబిల్లి : ఆలిండియా కిషాన్ సంయుక్త మోర్చా, కార్మిక సంఘాల ఐక్య కార్యచరణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామీణ బంద్ మండలం ఉల్లి భద్ర జంక్షన్ వద్ద రాష్ట్ర రహదారిపై రైతులు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు బివి రమణ, కరణం రవీంద్ర తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు దాసరి వెంకటనాయుడు, రెడ్డి సూర్యనారాయణ, మిత్తిరెడ్డి శంకర్రావు , రెడ్డి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



పాచిపెంటలో ర్యాలీ చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు





బలిజిపేట, గుమ్మలక్ష్మీపురంలో మానవహారం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు, గిరిజనులు



సీతానగరంలో రాస్తారోకో చేస్తున్న రైతులు, కార్మికులు, నాయకులు

తాత్సారం చేస్తే మూల్యం తప్పదు

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల జెఎసి హెచ్చరిక

కలెక్టరేట్ వద్ద నిరసన

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం తాత్సారం చేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి (జెఎసి) హెచ్చరించింది. ఈ మేరకు మూడో రోజు శుక్రవారం పలు ఉద్యోగ, పింఛన్‌దారుల సంఘం నాయకులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల ఉమ్మడి సమస్యల పరిష్కారం కోసం తప్పనిసరి పరిస్థితుల్లో పోరాటానికి కార్యాచరణ ప్రకటించాల్సి వచ్చిందన్నారు. తక్షణమే మధ్యంతర భతి (ఐఆర్) 30% ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యోగులు తమ సొంత డబ్బును సబ్స్క్రిప్షన్ గా కడుతూ పిఎఫ్, ఎపిజిఎల్ రుణాలు, పార్టీ ఫైనల్స్ దరఖాస్తు చేసుకొన్న నెలలు తరబడి పెండింగ్లో ఉన్నాయన్నారు. సరెండర్ లీవ్ ఎన్‌కేషన్‌మెంట్, మెడికల్ రీయంబర్స్మెంట్, 11వ సిఆర్పి డిఎ బకాయిలు, ఉద్యోగుల టిఎ, డిఎ బకాయిలు ఏళ్ల తరబడి పెండింగ్లో ఉన్నాయన్నారు. తక్షణమే రూ.25వేల కోట్లు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెఎసి చైర్మన్ జివిఆర్ కిషోర్, పింఛనుదారుల సంఘం కార్యదర్శి డి.గణపతి రావు, ఆరోగ్య శాఖ ఉద్యోగ ప్రతినిధులు బి.పుష్ప, కె.రాణితో పాటు ఎపి ఎన్జీవో, ఎపి ట్రెజరీ, మెడికల్, క్లాస్ ఫోర్, పంచాయితీ రాజ్ శాఖ, మున్సిపాలిటీ, పంచాయతీ గ్రామ, వార్డు సచివాలయ సంఘ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న జెఎసి నాయకులు

20న యువతకు ఉపన్యాస పోటీలు

ప్రజాశక్తి - పార్వతీపురం

యువతకు ఉపన్యాస పోటీలను ఈనెల 20న నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి కె వెంకట్ ఉజ్వల్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖకు చెందిన నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ఆదేశాల మేరకు వీటిని నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. న్యూఢిల్లీ పార్లమెంట్ భవనంలో జరిగే జాతీయ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్స్ – 2024 అనే కార్యక్రమంలో భాగంగా పార్లమెంట్‌లో ప్రసంగించే అవకాశం కోసం ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్లు వెంకట్ ఉజ్వల్ తెలిపారు. జిల్లాలో 18 – 25 ఏళ్ల మధ్య వయస్సు గల యువతీ యువకులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని, ఈ పోటీలో భాగంగా ఫ్రమ్ ఆత్మనిర్భార్ భారత్ టు విక్సిత్ భారత్ మేకింగ్ ఇండియా ఎ గ్లోబల్ లీడర్ ఎంపవరింగ్ ది ఫ్యూచర్ అనే అంశాలపై ఈ ఉపన్యాస పోటీలు ఉంటాయని అన్నారు. జిల్లాలో గెలుపొందిన విజేత రాష్ట్రస్థాయి, అక్కడ నుంచి దేశ స్థాయిలో పోటీలు ఉంటాయని చెప్పారు. దేశ స్థాయిలో గెలిచిన విజేతలకు నగదు బహుమతులు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. జిల్లాస్థాయి పోటీలు ఈనెల 20 ఉదయం 10 గంటలకు ఆన్లైన్ వర్చ్యువల్ మోడ్‌లో జరుగుతాయని తెలిపారు. జిల్లాలోని యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 7036485273 ఫోన్ నెంబరుకు సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

ఒపిఎస్‌ను అమలు చేయాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఎన్‌పిఎస్‌ను రద్దుచేసి ఒపిఎస్‌ను తిరిగి అమలు చేయాలని పోస్టల్ ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. అఖిల భారత తపాలా ఉద్యోగ సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం పార్వతీపురంలో ఉద్యోగ సమయం ముగిసిన తర్వాత ఆ సంఘం నాయకులు గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కొరకు ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేందుకు ఎన్ఎఫ్‌పిఇ కోఆర్డినేషన్ కమిటీకి సహకరించాలని కోరుతూ 8వ వేతన సవరణ కమీషన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. ఎన్ఎఫ్‌పిఇ, ఎఐపిఇయుల్లో గ్రేట్ సి సంఘాల గుర్తింపును తిరిగి పునరుద్ధరించాలని, ప్రభుత్వరంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, నిలిపివేసిన 18నెలల కరువు భత్యం బకాయిలను విడుదల చేయాలని, ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి, ప్రభుత్వరంగ సంస్థల కార్పొరేటీకరణ/ ప్రైవేటీకరణ ఆపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోస్టల్ ఉద్యోగుల సంఘం నాయకులు జె.రవీంద్ర, బి.ఉమా శంకరరావు, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.



పోస్టాఫీసు వద్ద నిరసన తెలుపుతున్న పోస్టల్ ఉద్యోగులు

ఎమ్మెల్యేలంతా ఇసుక, భూదందాలే

- కోలగట్ల గంజాయి అడ్డాగా మార్చేశారు
- జిల్లాలో ఒక్క హామీ కూడా నెరవేరలేదు
- అధికారంలోకి రాగానే తిన్నదంతా కక్కిస్తాం
- శంఖారావం సభల్లో లోకేష్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి, విజయనగరం కోట, నెల్లిమర్ల, గంట్యాడ

విజయనగరం, నెల్లిమర్ల ఎమ్మెల్యేలు జిల్లాలో ఇసుక, భూ దందాలకు పాల్పడుతున్నారని, ఎదురు తిరిగిన ప్రజలపైనా, టిడిపి కార్యకర్తలపైనా అక్రమ కేసులు, ఆపై రాజకీయ వేధింపులకు పాల్పడుతున్నారని టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. విజయనగరం ఎమ్మెల్యే కోలగట్ల మరో అడుగు ముందుకు వేసి భూదందాలతోపాటు తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ అనంతబాబుతో చేతులు కలిపి విజయనగరాన్ని గంజాయికి అడ్డాగా మార్చేశారని విమర్శించారు. అధికారంలోకి రాగానే వైసిపి నాయులు దోచుకున్నదంతా కక్కిస్తానని, ప్రజలను, టిడిపి కార్యకర్తలను వేధింపులకు పాల్పడిన వైసిపి నాయకుల భరతం పడతానని హెచ్చరించారు. నెల్లిమర్ల నియోజకవర్గంలోని రామతీర్థం, విజయనగరం, గజపతినగరం నియోజకవర్గంలోని గంట్యాడలో శుక్రవారం నిర్వహించిన శంఖారావం సభల్లో ఆయన మాట్లాడారు. సిఎం జగన్ అధికారంలోకి రాక ముందు విజయనగరం జిల్లాకు 50 హామీలు ఇచ్చినా వాటిని నెరవేర్చలేదని విమర్శించారు. భోగాపురం ఎయిర్ పోర్ట్, రామతీర్థసాగర్ ప్రాజెక్టు, పెద్దగెడ్డ పూర్తి, గోస్తాని – చంపావతి నదుల అనుసంధానం, స్వర్ణముఖి – చిట్టిగడ్డపై బ్రిడ్జి ఆచరణకు నోచుకోలేదన్నారు. టిడిపి ప్రభుత్వంలో విజయనగరం జిల్లాలో అత్యధికంగా రోడ్లు, భవనాలు, ఆసుపత్రు అభివృద్ధి, టూరిజం ప్రాజెక్టులు, సాగు–తాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యతనిచ్చిందన్నారు.

సిఎం జగన్ అవినీతికేసులో కేసు ఏ2గా ఉన్న విజయసాయిరెడ్డి టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు అశోక్ గజపతిరాజును అవమానిస్తూ, ఆయనకు చెందిన మాన్సాస్ ట్రస్టును లాగేసుకునేందుకు ప్రయత్నించారని అన్నారు. అధికారంలోకి రాగానే 'అశోక్ జగపతిరాజుతో పెట్టుకున్నానా అని భయపడేలా చేస్తాను అని లోకేష్ అన్నారు. ఎమ్మెల్యే వీరభద్రస్వామి అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా విజయనగరాన్ని మార్చారని అన్నారు. ప్రభుత్వ భూములు లాక్కుని పార్టీ కార్యాలయం కట్టుకున్నారన్నారు. ఎకరా రూ.15 లక్షలకు కొనుగోలు చేసి, ప్రజలకు ప్రభుత్వం తరపున ఇచ్చే సెంటు పట్టాల కోసం రూ.38 లక్షలకు విక్రయించిన ఘనత స్వామిదేనన్నారు. ఇటువంటి దందాలపై నిలదీసిన టిడిపి కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టించి వేధింపులకు గురిచేస్తున్నాడని అన్నారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే అప్పలనాయుడు, ఆయన కొడుకు మణిదీప్ నియోజకవర్గం లోని ఇసుక, ఇతర గనులను కాజేస్తున్నారని విమర్శించారు. పేద ప్రజల భూములు కూడా వారి పేర్లపై ట్రాన్స్ ఫర్ చేసుకుంటున్నారన్నారు. టిడిపి–జనసేన ప్రభుత్వం అధికారంలోకి గానే చింతపల్లిలో తలపెట్టిన జెట్టీని నిర్మిస్తామన్నారు. తారకరామతీర్థసాగర్, భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మిస్తామని, మూతపడిన జూట్ మిల్లులను తెరిపిస్తామని, పెండింగ్‌లో ఉన్న టిడ్కో ఇళ్లను వంద రోజుల్లో పూర్తిచేసి లబ్ధిదారులకు అప్పగిస్తామని హామీ ఇచ్చారు. విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు కిమిడి నాగార్జున, నెల్లిమర్లలో నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు మాట్లాడారు.

ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి : జనసేన

రానున్న ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని జనసేన జిల్లా ఇన్‌ఛార్జి లోకం మాధవి, విజయనగరం, గజపతినగరం నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు పాలవలస శయశ్విని, మర్రాపు సురేష్ అన్నారు. సభల్లో పలువురు టిడిపి, జనసేన నాయకులు

వినతులు వెల్లువ

నారా లోకేష్‌కు పలువురు తమ సమస్యలపై వినతులు ఇచ్చారు. పోలవరం ప్రధాన కాలువ ఎలైన్‌మెంట్ మార్పుతో రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని, దాన్ని రీ డిజైన్ చేయాలని ఉత్తరాంధ్ర సుజల స్రవంతి భూ బాధితులు కోరారు. పూర్తిస్థాయిలో డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసేలా చూడాలని డిఎస్‌సి అభ్యర్థులు వినతులిచ్చారు.





బహిరంగ సభలో మాట్లాడుతున్న నారా లోకేష్

మాతా శిశు మరణాల నియంత్రణే లక్ష్యం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మాతా శిశు ఆరోగ్యం పట్ల అప్రమత్తం చేసేందుకు కిల్కారి పేరిట వాయిస్ కాల్స్ అందించేందుకు ప్రభుత్వం రూపకల్పన చేసిందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. జగన్నాథరావు అన్నారు. ఆశా నోడల్ అధికారులకు కిల్కారి మొబైల్ అకాడమీ(కెఎంఎ)పై శిక్షణా కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్య కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. కెఎంఎ స్టేట్ ప్రోగ్రాం అధికారి ఎల్.రాజు, రీజనల్ ప్రోగ్రాం అధికారి ఆర్.మోహనరావు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా శిక్షణను ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్నాథరావు మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ఆహార నియమాలు, వైద్య పరీక్షలు తదితర అంశాలను కిల్కారి వాయిస్ కాల్స్ ద్వారా వివరిస్తారని, గర్భిణీని నమోదు చేసేటప్పుడు స్థానిక ఏఎన్ఎమ్ కిల్కారి మొబైల్ నంబర్ ఇస్తారని అన్నారు. ఆర్సిహెచ్ పోర్టల్ లో నమోదు కాబడిన ప్రతీ గర్భవతికీ 01244588000 నంబర్ నుంచి వాయిస్ కాల్ వస్తుందన్నారు. ఒక వేళ ఫోన్‌కు స్పందించకపోతే ఐవిఆర్ సిస్టం ఆటోమేటిక్ గా ఒకే రోజు మూడు సార్లు ఫోన్ కాల్ వచ్చేలా చేస్తుందన్నారు. మళ్లీ ఆ సందేశాలను వినాలి అనుకుంటే 14423 టోల్ ఫ్రీ నెంబర్ కు డయల్ చేసి వినవచ్చని అన్నారు. ఆశా కార్యకర్తల విజ్ఞానాన్ని బలోపేతం చేయడం ద్వారా మెరుగైన మాతా శిశు ఆరోగ్య సంరక్షణ సేవలు అందించేందుకు మొబైల్ అకాడమీ కోర్స్ ని 11 షెడ్యూల్స్ ద్వారా అందించేందుకు రూపకల్పన చేశారన్నారు. కిల్కారి మొబైల్ అకాడమీ సేవలు క్షేత్ర స్థాయిలో పూర్తిగా అందేలా వైద్య సిబ్బంది కృషి చేసి మాతా శిశు మరణాల నియంత్రణకు పాటు పడాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆర్బిఎస్‌కె అధికారి డాక్టర్ డి.భాస్కరరావు, డిఐఒ డాక్టర్ నారాయణరావు, డిఎంఒ డాక్టర్ టి.జగన్ మోహనంావు, డిపిహెచ్ ఎన్ఒ ఉషారాణి, డిఎస్ఒ శంకర్, డిపిఒ లీలారాణి, విజయ లక్ష్మి,ఆదిలక్ష్మి, జయగౌడ్ పాల్గొన్నారు.



వైవి సుబ్బారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న స్వాతీరాణి, హైమావతి

సుబ్బారెడ్డికి స్వాతీరాణి శుభాకాంక్షలు

ప్రజాశక్తి - సాలూరు

రాజ్యసభ సభ్యుడు (ఎంపి)గా ఏకగ్రీవంగా ఎన్నికైన ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డికి మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, జిసిసి చైర్‌పర్సన్ డాక్టర్ శోభా స్వాతీరాణి, ఆమె భర్త గుల్లిపల్లి గణేష్ శుక్రవారం కలిశారు. ఎంపీగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా ఆయన్ను విశాఖపట్నంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వైసిపి తరఫున రాజ్యసభ సభ్యులుగా నామినేషన్ వేసిన ముగ్గురిలో వైవి సుబ్బారెడ్డి ఒకరు.

పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు ఉండాలి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి అన్నారు. శుక్రవారం పాలకొండ నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల ప్రతినిధులు, నాలుగు మండలాల తహశీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఓటరు జాబితాలో వచ్చిన తప్పులను సవరిస్తున్నామన్నారు. మార్పుల్సిన పోలింగ్ కేంద్రాల జాబితాను త్వరితగతిన ఇవ్వాలని తహశీల్దార్లకు సూచించారు. పోలింగ్ కేంద్రం మార్చేటప్పుడు సంబంధిత గ్రామంలో రాజకీయ పార్టీలు, గ్రామపెద్దలతో సమావేశం నిర్వహించి, తీర్మానం చేసి మాత్రమే మార్చాలని అన్నారు. కొత్తగా ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్లు, డీటీలు, ఇతర ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రిన్సిపల్‌కు సూచనలు చేస్తున్న విద్యాశాఖ ఎడి దామోదరరావు

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

ప్రజాశక్తి - కురుపాం

పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా చూడాలని జిల్లా విద్యాశాఖ ఎడి పి.దామోదరరావు సూచించారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు అస్వస్థత గురయ్యారని 'ప్రజాశక్తి' ప్రచురితమైన వార్తకు స్పందించి శుక్రవారం పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు పెట్టె మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనాలు బాగోలేక కొందరు విద్యార్థులు అస్వస్థత గురైన సంఘటనకు గల కారణాలను ప్రిన్సిపల్ వి.రామలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. ఇకపై విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన భోజనాలు వండిపెట్టెలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం స్టాక్ రూంను పరిశీలించి, పాడైన చోడి పిండి ప్యాకెట్లును తిరిగి పంపించాలన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజనం జిల్లా కోఆర్డినేటర్ జి.శివున్నాయుడు, యు.నాగేశ్వరరావు, ఎంఇఒ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జెసిబిని ప్రారంభించిన డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో ఇటీవల కొనుగోలు చేసిన జెసిబిని డిప్యూటీ సీఎం రాజన్నదొర శుక్రవారం ప్రారంభించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.22లక్షలతో కొనుగోలు చేసిన జెసిబికి మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, జర్జాపు దీప్తి, కౌన్సిలర్లు పూజలు నిర్వహించారు. అనంతరం డిప్యూటీ సిఎం రాజన్నదొర జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, కౌన్సిలర్లు రాపాక మాధవరావు, పప్పల లక్ష్మణరావు, గొర్లి వెంకటరమణ, బి.శ్రీనివాసరావు, పి.మధుసూధనరావు, కమిషనర్ పి.ప్రేమప్రసన్న వాణి, డిఇ శ్రీరామ్మూర్తి, ఎఇ సూరి నాయుడు, మేనేజర్ రాఘవాచార్యులు పాల్గొన్నారు.

టిడిపి గెలిచే అవకాశం లేదు : ఎంపిపి

ప్రజాశక్తి - వీరఘట్టం

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశం లేదని ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో పాల్గొన్నారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఏం చేశారన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక అనేక సంక్షేమ పథకాలు వాలంటీర్ ద్వారా పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రతి వాలంటరీ సైనికుడిలా పనిచేస్తే మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డికి పట్టం కట్టేలే పనిచేయాలని కోరారు. అనంతరం వాలంటీర్లను సన్మానించారు. పంచాయతీ ఇఒ వి.రామచంద్రరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్.సాల్మన్ రాజు, పిఎసిఎస్ డైరెక్టర్ బోగి మాణిక్యచంద్రశేఖర్, దిబ్బ శంకర్ జయదేవ్, బొమ్మాలి బాబురావు, శంబాన శ్రీనివాసరావు, సచివాలయాల సిబ్బంది, విఆర్ఒ జి.సురేష్ కుమార్, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - భామిని

ఆరోగ్యశ్రీ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ కొవ్వాడ కిషోర్ కుమార్ తెలిపారు. వడ్డాంగిలో రెండో విడత ఆరోగ్యశ్రీ శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 421ఒపిలను వైద్యులు పరిశీలించి మందులు అందజేశారు. కంటి వెలుగులో భాగంగా కళ్లద్దాలు పంపిణీ చేశామని వైద్యాధికారి పి.సోయల్ తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఔదార్యం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పట్టణ శివారు వెంకంపేట కూడలి సమీపంలో శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది. బైక్ ఢీకొట్టడంతో మండలంలోని చొక్కాపు వాని వలసకు చెందిన మహిళ గాయపడింది. అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు జనాలు గుమిగూడి ఉండడంతో కారు ఆపి ఘటనా స్థలానికి చేరుకుని విషయం తెలుసుకున్నారు. తక్షణ వైద్య సహాయం కొరకు 108కు ఫోన్ చేయగా వేరే కేసులో ఉన్నందున వాహనం రావడానికి సమయం పడుతుందని తెలుపడంతో అంబులెన్స్ రావడం ఆలస్యం అవుతుందని, ఆ దారిలో వెళ్తున్న ఆటోను ఆపి బాధితురాలిని జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వైద్యాధికారులకు ఫోన్ చేసి విషయాన్ని వివరించి బాధితురాలికి తక్షణమే వైద్య సహాయం అందించాలని కోరారు. ఎమ్మెల్యే స్పందనకు స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

జాబ్‌కార్డ్ ఉన్న వారికి పని కల్పించాలి

ప్రజాశక్తి - సీతంపేట

జాబు కార్డు ఉన్నవారికి వంద రోజులు పని కల్పించాలని కె.గీతాంజలి అన్నారు. మండలంలో కిరప పంచాయతీ కాంగూడలో సర్పంచ్ సరస్వతి ఆధ్వర్యంలో ఉపాధిహామీపై సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వేతనదారులకు తప్పనిసరిగా పని కల్పించాలన్నారు. పనులు జరిగే చోట సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. జాబ్ కార్డు అప్డేట్ గురించి తెలిపారు. కార్యక్రమంలో ఎపిఒ బాబురావు, వేతనదారులు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి పాలనపై చర్చకు సిద్ధం : టిడిపి

ప్రజా శక్తి -భామిని

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రసంగాన్ని మండల వైసిపి నాయకులు తప్పుపట్టిన నేపథ్యంలో స్థానిక టిడిపి మండల కమిటీ వై సి పి పాలనకు చర్చకు రావాలని సవాలు విసిరింది. వైసిపి మండల కన్వీనర్ ఆధ్వర్యంలో మండల వై సి పి సభ్యులు చర్చకు మేము సిద్ధం అని చెప్పడంతో, శుక్రవారం భామిని టిడిపి కార్యక్రమంలో వై సి పి నాయకులు చర్చకు తేదీ ప్రకటిస్తే తాము సిద్ధంగా ఉన్నామని మండల టిడిపి ప్రధాన కార్యదర్శి మెడిబోయిన జగదీశ్వరరావు తెలిపారు. విలేకరుల సమావేశంలో టిడిపి అధ్యక్షులు బోగాపురపు రవి , సాకేటి రామారావు, మండలి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అవినీతిపై చర్చకు సిద్ధమేనా..?

తేదీ, వేదిక ప్రకటిస్తారా..? : నిమ్మక

ప్రజాశక్తి - పాలకొండ

మీరు చేసిన అవినీతిని నిరూపించడానికి మేం సిద్ధంగా ఉన్నామని, మీరేమి అభివృద్ధి చేశారో చెప్పడానికి సిద్ధంగా ఉన్నారా..? ఈ నాలుగున్నరేళ్లలో పాలకొండ నియోజకవర్గానికి ఏం అభివృద్ధి చేశారో చెప్పాలంటూ పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఎమ్మెల్యే కళావతికి సవాల్ విసిరారు. చర్చకు తేదీ.. వేదిక ప్రకటించే.. సత్తా మీకుందా అని ప్రశ్నించారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. తనపై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. మాట్లాడే అర్హత లేదనడం సరికాదన్నారు. ఎమ్మెల్యేగా తన తండ్రి, ఎంపీగా తాతలు విశిష్టమైన సేవలందించిన కుటుంబానికి చెందిన వ్యక్తిని, ఎన్నికల నిధులు తాను దుర్వినియోగం చేశానని ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఎమ్మెల్సీ విక్రాంత్ రూ.5కోట్లతో ఎన్నికల ముందుగా అడ్డంగా పోలీసులకు దొరికిన విషయం మీరు మరిచిపోయారా అని గుర్తు చేశారు. గిరిజన సామాజిక వర్గానికి ఏం చేశారని ప్రశ్నించారు. బోయివాల్మీకులను గిరిజనుల్లో కలపడాన్ని గిరిజనులంతా వ్యతిరేకిస్తే... గిరిజన ఎమ్మెల్యేగా చెప్పుకుంటున్న కళావతి తనతో పాటు గిరిజనులపై తప్పుడు కేసులు బనాయించిన విషయం ఎవరూ మరిచిపోలేదన్నారు. వడ్డింగి, బత్తిలి, కొండలోవ లిఫ్టు ఇరిగేషన్ పనులకు టిడిపి హయాంలో నిధులు కేటాయిస్తే వాటిని వెనుక్కి మళ్లించారన్నారు. తోటపల్లికి తాము రూ.192 కోట్లు నిధులు మంజూరు చేస్తే.. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం 8 శాతం పనులు మాత్రం జరిగాయన్నారు. బినామీల పేరుతో ఇసుకను దోచుకుంటున్నారని, నెలవారీ ముడుపులు అందుకుంటున్నారని ఆరోపించారు. ఎమ్మెల్సీ విక్రాంత్ బావమరిది కోరాడ రవి ఇసుక దందా చేస్తూ మీ ఇద్దరికి వాటాలు పంచడం లేదా అని ప్రశ్నించారు. నాగావళి, వంశధార నదులను ఇద్దరు పంచుకున్నారన్నారు. వండువలో రాయుడు చెరువు 50 ఎకరాల్లో మీ కుటుంబం అనుభవిస్తుందని, ప్రభుత్వం వారిపై ఆక్రమ కేసులు పెడుతున్నారన్నారు. నగర పంచాయతీలో డిగ్రీ కళాశాల దగ్గర 30 సెంట్లు ఆక్రమించుకున్నారని, గారమ్మ కాలనీలో 28 సెంట్లు సామాజిక అవసరాలకు గుర్తించిన స్థలాన్ని బినామీల పేరుతో ఆక్రమించుకుని లక్షలాది రూపాయలు చేతులు మారలేదా అని ప్రశ్నించారు. ఒక్క పైసా కూడా నిధులు తీసుకురాలేని పరిస్థితిలో ఇక్కడ నాయకులున్నారన్నారు. 2024 ఎన్నికలలో మీకు బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, పట్టణ అధ్యక్షులు గంటా సంతోష్, జాడ శ్రీధర్, అంపోలు శ్రీను, సుంకరి అనిల్, తమ్మారావు, కిమిడి కాశీంనాయుడు, కోట సంగంనాయుడు తదితరులున్నారు.

హుందాగా ప్రవర్తించాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

బాధ్యత గల పదవిలో ఉన్నవారు రాజకీయాలు హుందాగా చేయాలని, అధికారం ఉంది కదా అని అహంకారాన్ని ప్రదర్శిస్తే ప్రజల ముందు దోషులుగా నిలబడాల్సి వస్తుందని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు అన్నారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ ఇన్చార్జి బోనెల విజయచంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ అధికార ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం సాగడం సహజమేనని అన్నారు. అవి వ్యక్తిగతాల వరకు వెళ్లకుండా హుందాతనాన్ని మర్చిపోయి ఎదుటి వ్యక్తులను తూలనాడడం తగిన పని కాదని అన్నారు. ప్రతిపక్ష బాధ్యత వహిస్తున్న వారిపై ఏమైనా ఆరోపణలుంటే అధికారంలో ఉన్నవారు కచ్చితంగా వాటిపై విచారణ జరిపి ప్రజల ముందు పెట్టడంలో తప్పు లేదన్నారు. అంతేగాని ఆధారాలు లేని ఆరోపణలు చేసి బురద జల్లడం సరికాదన్నారు. 30 ఏళ్లుగా పార్వతీపురం నియోజకవర్గ ప్రజలకు ఎవరు ఏమిటనేది అందరికీ తెలుసని, ఎప్పుడు ఎవరికీ ఎలా సమాధానం చెప్పాలో సమయం వచ్చినప్పుడు ప్రజలే గుణపాఠం నేర్పుతారని అన్నారు. ఈమధ్యనే దానికి హెచ్చరిక మరిచి మాట్లాడే వ్యక్తిగతంగా దిగజారి ప్రవర్తించడం తగదని అన్నారు. గౌరవప్రదమైన రాజకీయాలు చేయడానికి అందరూ హుందాగా ప్రవర్తించడం అలవర్చుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రజలను, నాయకులను రెచ్చగొట్టే ఇక్కడ కలుషితం చేయడం వంటివి చేసే దిగజారి ప్రవర్తిస్తే రాబోయే ఎన్నికల్లో ప్రజలే సరైన సమాధానం చెబుతారని కనుక రాబోయే ఎన్నికలను ఇరు వర్గాలకు చెందిన ప్రధాన నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించి, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను ఎదుర్కోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో నాయకులు గొట్టాపు వెంకట నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతోనే గ్రామస్వరాజ్యం

ప్రజాశక్తి - సీతానగరం

గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య సచివాలయం వ్యవస్థతోనే సాధ్యమని స్థానిక ఎమ్మెల్యే ఎ.జోగారావు అన్నారు. మండలంలోని తామరఖండిలో రూ.43లక్షల నిధులతో కొత్తగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని, రక్షితమంచినీటి పథకాన్ని, బోరును ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో గ్రామంలో అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాల ద్వారా నేరుగా ప్రజలకు లబ్ధి చేకూరిందన్నారు. అలాగే గ్రామంలో వందల మీటర్ల సీసీ కాలువలు, రోడ్లతో పాటు నాడు-నేడు ద్వారా పాఠశాలను అభివృద్ధి చేశామని, ఇంటింటికి కుళాయిలు ద్వారా తాగు నీరు సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి బలగ రవణమ్మ, బలగ శ్రీరాములు నాయుడు, జెడ్పీటీసీ మామిడి బాబ్జీ, మండల వైసిపి అధ్యక్షులు బొంగు చిట్టి రాజు, ఎంపిడిఒ ఎం.ఈశ్వరరావు, ఎఒ ప్రసాద్, ఎంపిటిసి ఏగిరెడ్డి గౌరీశ్వరి శ్రీనివాసరావు, సర్పంచ్ వెంకటనాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు మూడడ్ల మన్మధరావు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయాల సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. అనంతరం వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో గెడ్డలుప్పి, తామరకండి, ఆర్.వెంకంపేట, చినబోగిలి గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న వాలంటీర్ల సేవలను కొనియాడారు. తామరఖండి సచివాలయం ప్రారంభం అనంతరం ఆ వేదికపై వారందరినీ ఎమ్మెల్యే ఘనంగా సత్కరించి, సన్మానించారు.



వాలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

నిజాలు మాట్లాడితే కేసులా?

●చిన్న శ్రీను కనుసన్నల్లో పనిచేస్తున్నారా? లేదా?
●డిప్యూటీ సిఎం వ్యాఖ్యలపై సంధ్యారాణి

ప్రజాశక్తి - సాలూరు

నిజాలు మాట్లాడిన వారిపై అట్రాసిటీ కేసు పెడతానని డిప్యూటీ సిఎం రాజన్నదొర పదేపదే చెప్పడం తగదని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు జి.సంధ్యారాణి హితవు పలికారు. శుక్రవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. టిడిపి శంఖారావ సభలో జాతీయ కార్యదర్శి లోకేష్ చేసిన వ్యాఖ్యల్లో తప్పేముందని ప్రశ్నించారు. డిప్యూటీ సిఎం రాజన్నదొర సిరా లేని పెన్ను లాంటి వారని లోకేష్ చేసిన వ్యాఖ్యలు నిజమే కదా అన్నారు. నిజాలు మాట్లాడిన బిసి, ఒసి నాయకులపై అట్రాసిటీ కేసు పెడతానని బెదిరిస్తారా అని దుయ్యబట్టారు. బిసి, ఒసిల ఓట్లతో మీరు ఎమ్మెల్యేగా గెలవలేదానని ప్రశ్నించారు. వాస్తవాలు రాసిన విలేకరులపైనా అట్రాసిటీ కేసు పెడతానని బెదిరించడం మానుకోవాలని కోరారు. నియోజకవర్గం లో ఏ గొడవ గాని, సమస్య గాని తలెత్తినా జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వద్దకు పంపిస్తున్నప్పుడు సిరా లేని పెన్ను అంటే తప్పేముందని అన్నారు. హెూదాలో డిప్యూటీ సిఎం కంటే జెడ్పీ చైర్మన్ పెద్ద కానప్పుడు ప్రతి చిన్న విషయాన్ని ఆయన వద్దకు ఎందుకు పంపిస్తారని నిలదీశారు. రెండున్నరేళ్ల తర్వాత మున్సిపల్ చైర్మన్ మార్పు అంశాన్ని రాజన్నదొర పరిష్కరించకుండా చిన్న శ్రీను వద్ద పంచాయతీ పెట్టలేదా అని ప్రశ్నించారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా రెండేళ్లలో సాధించిందేముందని ప్రశ్నించారు. మీరు అభిమానించే నాయకుల ప్రయోజనాల కోసం గిరిజన యూనివర్సిటీని వారు కోరుకున్న ప్రదేశంలో పెట్టించలేదా? సంబంధిత శాఖ మంత్రిగా గిరిజన యూనివర్సిటీని మన్యం జిల్లాలో ఎందుకు ఏర్పాటు చేయించ లేకపోయారు? గిరిజన గ్రామాల్లో మూతపడిన పాఠశాలలను ఎందుకు తెరిపించలేకపోయారని ఆమె నిలదీశారు. వాస్తవాలు మాట్లాడిన వారిపై కేసులు పెడతామని బెదిరించడం మానుకోవాలని సంధ్యారాణి కోరారు. సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతి రావు, మండల అధ్యక్షులు ఆముదాల పరమేష్, నాయకులు మత్స శ్యాం, డబ్బి కృష్ణ పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ ప్రారంభం

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ పరిధిలోని సీతంపేట రోడ్డులో ఐటిడిఎ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, శాసన మండలి ప్రభుత్వ విప్ పాలవలస విక్రాంత్, ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి ప్రారంభించారు. ప్రారంభోత్సవం సందర్భంగా పిఒ మాట్లాడుతూ వాహనదారుల సౌకర్యార్థం పెట్రోల్ బంక్ ఏర్పాటు చేశామని, వాహనదారులంతా సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో డిఎస్పి జివి కృష్ణారావు, నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు, ఎపిఒ రోసిరెడ్డి, పిహెచ్ఒ గణేష్, ఎటిడబ్ల్యుఒ మంగవేణి, హెచ్‌పిసిఎల్ సేల్స్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రోటోకాల్ మరిచారు

ఐటిడిఎ ఆధ్వర్యంలో ప్రారంభమైన పెట్రోల్ బంక్ ఆహ్వానంలో ప్రోటోకాల్ విస్మరించారు. కలెక్టర్ నిశాంత్ కుమార్, ప్రభుత్వ విప్ విక్రాంత్, ఎమ్మెల్యే కళావతి ని ఆహ్వానించిన ఐటిడిఎ అధికారులు నగరపంచాయితీ చైర్‌పర్సన్ ఎందవ రాధకుమారి ని, బంక్ పరిధిలో ఉన్న వెలమల మన్మధరావును ఆహ్వానించకపోవటం చర్చనీయాంశమైంది. ప్రజా ప్రతినిధులను చులకనగా చూడటం ఏమిటని పలువురు అంటున్నారు.

జాతీయ లోక్ అదాలత్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి - పార్వతీపురం

జాతీయ లోక్ అదాలత్‌పై ప్రజల్లో అవగాహన అవసరమని రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు అన్నారు. జాతీయ లోక్ అదాలత్ నిర్వహణలో భాగంగా పోలీసు అధికారులతో శుక్రవారం కోర్టులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక అదాలత్‌లో కేసులు పరిష్కారం కావడం ఇరు పక్షాలకు లాభదాయకమన్నారు. కక్షిదారులు ఈ అంశాలను పరిగణనలోకి తీసుకావాలని అన్నారు. సివిల్, క్రిమినల్ కేసులు పరిష్కారం చేసుకోవచ్చని ఆయన తెలిపారు. సమావేశంలో ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి ఏ రమేష్, అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శ్రీమతి డి సౌజన్య, బార్ ప్రెసిడెంట్ ఎన్ శ్రీనివాస రావు, ఏ పిపి చంద్ర కుమార్, జి వెంకట రావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతో స్వచ్ఛమైన ఆరోగ్యం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించి భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని, ఆరోగ్యాన్ని అందించేందుకు కృషి చేయాలని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. రాష్ట్ర వ్యాప్తి పిలుపులో భాగంగా జిల్లా కేంద్రంలో మున్సిపల్ కమిషనర్ పొందూరు సింహాచలం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక బైపాస్ రోడ్‌లో జగనన్న హరితనగరాలు మొక్కలునాటే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి, మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, భవిష్యత్ తరాల మనుగడకు స్వచ్ఛమైన వాతావరణం అందించేందుకు మొక్కలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. గ్రామాలతో పాటు నగరాల్లోనూ పచ్చదనం పరిడవిళ్లేలా ప్రజల ఆరోగ్యం పరిరక్షణ, పచ్చదనం పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. నగరాల్లోనూ విరివిగా మొక్కలు నాటి ప్రకృతి సమతౌల్యాన్ని కాపాడి వాతావరణంలో వేడిని తగ్గించి ప్రజలకు చల్లని, చక్కటి వాతావరణం అందించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్లు యిండుపూరి గున్నేష్, కొండపల్లి రుక్మిణి, కౌన్సిలర్లు, మున్సిపల్ డిఇ కిరణ్ కుమార్, ఎఇ సన్యాసిరావు, డిపిఒ పి.కనకారావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం : డిఎంఒ

ప్రజాశక్తి - కొమరాడ

డ్రైడే- ఫ్రైడే కార్యక్రమాలపై ప్రజల్లో చైతన్యం కలిగించాలని జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి.జగన్ మోహనరావు అన్నారు. పరశురాంపురంలో డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. సిబ్బందితో కలిసి ఆయన గ్రామంలోని పలు వీధుల్లో తిరుగుతూ ఇంటి పరిసరాలు, కాలువల్లో పరిశుభ్రత తీరును పరిశీలించారు. గ్రామ సర్పంచ్, పంచాయతీ సెక్రటరీ, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో అక్కడ చేపట్టిన కాల్వల్లో పూడికతీత నిర్వహణను ఆయన గమనించారు. తద్వారా నీరు నిల్వ లేకుండా ఉంటుందన్నారు. డాక్టర్ జగన్మోహనరావు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న డ్రైడే కార్యక్రమాల ముఖ్య ఉద్దేశ్యాన్ని అక్కడ ప్రజలకు వివరించారు. ఇళ్ల పరిసరాల్లో ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉండడం వల్ల అందులో దోమలు వృద్ధి చెందుతాయని, తిరిగి అవి మనకే పలు రోగాలకు కారణమవుతాయని అన్నారు. ముఖ్యంగా ఉపయోగంలో లేని వస్తువులు, పాడైన ప్లాస్టిక్ వస్తువులు, టైర్లు, కాలువల్లో చెత్తతో నిండి ఉండటం, ఫ్రిజ్ వెనుక భాగం ట్రేల్లో చేరిన నీరు మొదలగు వాటి వల్ల అక్కడ మలేరియా, డెంగీ, ఫైలేరియాకు కారణమయ్యే దోమలు వృద్ధి చెందుతాయని తెలిపారు. కావున పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సంబంధిత శాఖల సిబ్బంది సమన్వయంతో డ్రైడే కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన కల్పించి ప్రతి వారం పాటించేలా చైతన్యం కలిగించాలన్నారు. అనంతరం ఆయన హెల్త్ వెల్నెస్ కేంద్రంలో రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎఎంఒ సూర్యనారాయణ, పంచాయతీ సెక్రటరీ కె.అనిల్ కుమార్, వైద్య సిబ్బంది ప్రమీల, లత, రామకృష్ణ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలపై ఒత్తిడి... వారి వినాశనానికి నాంది..

ప్రజాశక్తి - బలిజిపేట

చిన్న వయస్సులోనే పిల్లలపై ఒత్తిడి ఉంటే వారి జీవితం వినాసానికి దారితీస్తుందని హెూలీ స్పిరిట్ కేర్ సెంటర్ సిస్టర్ జీవా అన్నారు. మండలంలోని చిలకలపల్లిలో గల జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మానసిక ఒత్తిడిపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల కాలంలో పిల్లలు అనేక రకాలుగా మానసిక ఒత్తిళ్లకు గురవుతున్నారన్నారు. చదువులో ఒత్తిడిలో గానీ, మొబైల్స్ చూడడంలో గానీ, ఇతర అసాంఘిక కార్యకలాపాలు చేయడంలోనే దూరంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా చిన్న వయసులోనే మద్యపానానికి, మత్తుకు అలవాటై బంగారు భవిష్యత్తును దూరం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలు ఉదయానే యోగా గానీ, ఆటలు ఆడడంలో గాని ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. పిల్లలపై ఒత్తిడి పెరిగే కొద్దీ వారు మానసికంగానూ ఆరోగ్యంగానూ నష్టపోతారని, దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని అన్నారు. కావున వెంటనే పిల్లలకు సరైన అవగాహన కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మజ్జి గౌరీశంకర్రావు, విద్యా కమిటీ చైర్మన్ ఆర్.ప్రసాద్, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సిస్టర్ జీవా

'రాజధాని ఫైల్స్'తో వైసిపి వెన్నులో వణుకు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రాజధాని ఫైల్ సినిమాతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వెన్నులో వణుకు పుడుతుందని కురుపాం నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి అన్నారు. శుక్రవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఒక సినిమాను చూసి ముఖ్యమంత్రి భయపడడం ఇదే తొలిసారి అని అన్నారు. రైతుల బతుకు చిత్రంపై తీసిన సినిమాను అడ్డుకునే నీచస్థితికి జగన్ రెడ్డి ప్రభుత్వం దిగజారిందని, సామాజిక బాధ్యతతో సినిమా తీస్తే జగన్ రెడ్డికి వచ్చిన నష్టమేమిటని ఆమె ప్రశ్నించారు. ఈ సినిమా ద్వారా ప్రజల్లో మరింత వ్యతిరేకత వస్తుందనే భయంతో వైసిపి కోర్టుకు వెళ్లిందన్నారు. 34 వేల మంది రైతుల త్యాగాలకు వాస్తు రూపంలో నిలిచింది రాజధాని ఫైల్ సినిమా అని, రైతుల త్యాగాలను బూడిదలో పోసిన పన్నీరు చేశారని అన్నారు. అసెంబ్లీ సాక్షిగా రాజధాని అమరావతి అని చెప్పిన జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే యూటర్న్ తీసుకున్నారని విమర్శించారు. రాజధాని నిర్మించడం వైసిపికి రాదని, నిర్మించిన అనుభవం కూడా లేదని జగదీశ్వరి ప్రభుత్వంపై నిప్పులు చేరిగారు. చంద్రబాబునాయుడు ప్రారంభించిన అమరావతిని కావాలనే జగన్‌రెడ్డి అడ్డుకున్నారని తెలిపారు. నిన్నటి వరకు కావాలనే మూడు రాజధానులు పాట పాడిన వైసిపి నేడు హైదరాబాద్ ఉమ్మడి రాజధాని అని అంటున్నారని ఇది కాదా సైకోకి నిదర్శనం అని ఆమె అన్నారు.

త్వరితగతిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ పొందూరు సింహాచలం అన్నారు. శుక్రవారం స్థానిక బెలగాం చర్చి వీధిలో బుడా నిధులతో జరుగుతున్న సిసి రోడ్, కాలువల నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ కాంట్రాక్టర్‌తో మాట్లాడుతూ జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరితగతిన పూర్తి చేసే వాడుకలోకి తెచ్చే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డిఇ కిరణ్ కుమార్, ఎఇ సన్యాసిరావు, టిపిఒ పి.కనకారావు, తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్ల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్ పేట గ్రామ సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న వాలంటీర్లు ప్రజలకు అందిస్తున్న సేవలను కొనియాడుతూ శుక్రవారం సన్మానించారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ వాలంటీర్ల సేవలు అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ జగదీష్ కుమార్, వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్, సర్పంచులు బి గౌరీ శంకర్ రావు, ఆర్ చైతన్య స్రవంతి, పంచాయతీ కార్యదర్శులు కిషోర్ కుమార్, నాగరాజు, కుమార్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న నరహరశాస్త్రి

ఘనంగా రథసప్తమి వేడుకలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణ శివారులో గల సూర్యపీఠంలో పీఠాధిపతి వేమకోటి నరహర శాస్త్రి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం 5గంటలకు పీఠాధిపతి నరహరి శాస్త్రి సౌర దీక్షాపరులతో రుత్వికులు స్వామివారి క్షీరాభిషేకాలు చేయించారు. అనంతరం ఉష, పద్మనీ, ఛాయా సూర్య భగవాడ్ని కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. జిల్లాకు ఒకటే సూర్య పీఠం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. సూర్య యోగ సెంటర్ నిర్వాహకులు మోహన్ గంతాయక్ ఆధ్వర్యంలో విద్యార్థులు యోగా విన్యాసాలు చేశారు. సాయంత్రం 6 గంటలకు సహస్ర దీపాలంకరణ రాత్రి 7 గంటలకు పూలంగి సేవలు అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో వివేకానంద శర్మ, పలువురు పౌరోహితులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : మండలంలోని నర్సిపురంలో వెలసిన సూర్య దేవాలయంలో శుక్రవారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు బడే శ్రీరాములు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలలో భాగంగా ప్రత్యేక పూజలు సూర్యనారాయణమూర్తికి నిర్వహించగా, పరిసర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో హాజరై భాస్కర దర్శనం చేసుకున్నారు.

నేరాలు ఘోరాలు

ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కురుపాం

ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని గుంజరాడ జంక్షన్ వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం సీమల జయశంకర్ (41) లేవిడి నుండి తన సొంత గ్రామమైన నీలకంఠాపురం వెళ్తుండగా మొండెంఖల్ నుంచి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనంతో ఢీకొంది. దీంతో ఆయన తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే ఆయన్ను భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి స్థానికులు తరలించగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. అదే ద్విచక్ర వాహనం వెనుక కూర్చొన్న నీలకంఠాపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయురాలు అడ్డాకులు చామంతికి తీవ్ర గాయాలవ్వడంతో భద్రగిరి సిహెచ్‌సిలో ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. వేరే ద్విచక్ర వాహనం వద్ద ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వీరు భద్రగిరి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. టైలరింగ్ చేస్తూ జీవనం సాగించే జయశంకర్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని టిటిడి సమీపంలో ఉన్న స్పీడ్ బ్రేకర్ వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడిన సంఘటనలో సవర సిరంగమ్మ(35) తలకు బలమైన గాయమై మృతి చెందింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మండ గ్రామానికి చెందిన సవర సిరంగమ్మ భర్త బాలిమ్మతో కలిసి బ్యాంకు పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై సీతంపేట వస్తుండగా టిటిడి సమీపంలో ఉన్న స్పీడ్ బ్రేకర్ వద్ద వాహనం అదుపుతప్పింది. దీంతో సిరంగమ్మ జారిపడడంతో తనకు బలమైన గాయమవ్వడంతో స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించగా, మార్గమధ్యలో మృతి చెందింది. శవ పంచనామా నిమిత్తం పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎఎస్ఐ సంజీవ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఒడిశా వాసి మృతి

ప్రజాశక్తి - కొమరాడ

విద్యుత్ షాక్‌కు గురై ఒడిశాకు చెందిన వ్యక్తి శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై నీలకంఠం తెలిపారు. మండలంలోని గంగరేగువలస సమీపాన గల లేఅవుట్‌లో ఒడిశాకు చెందిన ఇద్దరు వ్యక్తులు పనిచేస్తున్నారు. ఇక్కడ ఉన్న ఇనుము బోర్డును రోడ్‌పైకి తీసుకొస్తున్న సమయం విద్యుత్ వైరుకు బోర్డు తగిలింది. దీంతో విద్యుత్ షాక్‌కు గురై సుదం బిజిలి (36) మృతి చెందాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.